# అమంగళం ఎక్కడుంటే అక్కడే భయం!



**- కాకాని కమల**

ఒక్క ఉదుటున మంచం మీద నుంచి ఉలిక్కిపడి లేచాడు వెంకట్రామయ్య.

అర్ధరాత్రి.

నిశీధి సమయం.

పల్లె అంతా గాఢ నిద్రలో మునిగి ఉంది.

ఇంత నిశిరాత్రి గురకపెట్టి గాఢనిద్రలో ఉన్న వెంకట్రామయ్య ఎవరో వీపు మీద ఛెళ్ళున చరిచినట్లయి ఉలిక్కిపడ్డాడు.

బయట విపరీతంగా చలి పెడుతున్నా ఆయన శరీరమంతా చెమటతో తడిసి ముద్ద అయింది. నోరు దాహంతో ఎండుకుపోయింది. గుండె రెట్టింపు వేగంతో కొట్టుకుంటూంది. పోటెత్తిన సముద్రంలా రక్తం పొంగి పొర్లుతూంది. వెంకట్రామయ్య ఆపాద మస్తకం కంపిస్తున్నాడు. కళ్ళముందు ఏవో భయంకర దృశ్యాలు.

'అబ్బ! ఎంత పీడ కల! ఎంత దారుణమైన దృశ్యం!' నెమ్మదిగా అరచేతితో గుండె రాసుకున్నాడు.

తల తిప్పి పక్కకు చూశాడు.

భార్య వర్ధనమ్మ ఆదమరిచి నిద్రపోతూంది.

వెంకట్రామయ్యకు గుండె మీంచి కొండంత బరువు దించినట్లయింది. తనూ, తన ఇల్లూ, తన భార్యా—వాస్తవం స్ఫురణకు వచ్చింది.

'అమ్మయ్య! ఫరవాలేదు. ఇది కలే—కలే!' నెమ్మదిగా తనను తాను సమాధాయించుకున్నాడు.

వణికే చేతులతో మంచం కింద ఉన్న నీళ్ళ చెంబు అందుకుని ఎత్తి గటగటా నీళ్ళన్నీ తాగేశాడు.

మనస్సు కాస్త చల్లబడినట్టే అనిపించింది.

చెంబు కింద పెట్టి స్తిమితంగా గది అంతా తేరిపార చూశాడు.

గూట్లో వెలిగించి పెట్టిన లాంతరు గుడ్డిగా వెలుతురు చిమ్ముతూంది.

వెంకట్రామయ్యకు కళ్ళముందు కుమార్తె జ్యోతి మెదిలింది. మనసంతా అల్లకల్లోలంగా తయారయింది.

'జ్యోతి... నా చిట్టితల్లి.... ఎలా ఉందో?' సన్నగా గొణిగినట్లు తనలో తానే అనుకున్నాడు. ఆర్తిగా పదే పదే కూతుర్ని జ్ఞాపకం చేసుకున్నాడు.

పది నిమిషాల క్రితం కలలో కనిపించిన దృశ్యం తిరిగి మనసులో కదిలింది.

కట్టెలా చాపపై పడి ఉన్న అల్లుడు రాజారావు శవంపై పడి తన కుమార్తె జ్యోతి గోలుగోలున విలపిస్తున్న దృశ్యం, గుండె లవిసే దృశ్యం కళ్ళ ముందు మెదిలింది.

'ఛీ...ఛీ...' అసహనంగా తల విదుల్చుకున్నాడు వెంకట్రామయ్య.

'ఇదేమిటి, ఇలాంటి కల వచ్చింది? ఈ అరవై ఏళ్ళ అనుభవంలో ఎన్నడూ ఇంత అమంగళపు దృశ్యం తన ఊహల్లోకి పొరపాటున కూడా రాలేదే? అలాంటిది ఈరోజు... తన చిట్టితల్లిపై అలాంటి పాడు దృశ్యం కంట పడిం దేమిటి?'

పూపిరి అందనట్లు గిజగిజ లాడాడు వెంకట్రామయ్య. గుండె భారంగా తయారై మనసంతా కలకబారింది.

వెంకట్రామయ్య, వర్ధనమ్మ దంపతుల ఏకైక గారాల పట్టి జ్యోతి. నాలుగు సంవత్సరాల క్రితమే వివాహం అయింది. రెండేళ్ళ కొడుకుతో కలకల లాడుతూ చక్కగా సంసారం చేసుకుంటూంది. అల్లుడు రాజారావు కూడా చాలా మంచివాడు; సహృదయుడు. భార్య అన్నా, సంసారం అన్నా ఎంతో ఆపేక్ష. జ్యోతి జీవితం ఏ ఒడిదుడుకులూ లేకుండా సాగిపోతూంది. అట్లాంటి సమయంలో అపశ్రుతిలాగ తనకు ఈ పీడ కల ఏమిటి?

వెంకట్రామయ్య మనసంతా అల్లకల్లోలంగా తయారయింది. ఎంత 'వద్దు' అనుకున్నా ఆలోచనలు కుమార్తె మీదికే మళ్ళుతున్నాయి.

'వారం రోజుల క్రితమే అమ్మాయి దగ్గరి నుంచి ఉత్తరం వచ్చింది. అంతా కులాసాగానే ఉన్నట్లు వ్రాసింది. దానికేం? అదృష్టవంతురాలు. దానిది దివ్యమైన జాతకం. భార్యాభర్త లిద్దరిది పూర్ణాయుష్యు. తన చిట్టి తల్లి దీర్ఘ సుమంగళి. దాని వదనంలో లక్ష్మీ కళ ఉట్టి పడుతూ ఉంటుంది. అవును, ఏదో చిన్న కలకు తాను ఆందోళన చెందటం ఏమిటి? ఉత్తరపు దిక్కుగా తల పెట్టుకుని పడుకున్నా డీ రోజు. ఆ దుష్ఫలితమే ఈ పీడ కల. అంతే అయి ఉంటుంది. ఇది కేవలం కల—పీడ కల. ఆ పీడ పరిహారం ఎవర్నో కొట్టేస్తుంది.' నిబ్బరంగా తనను తాను సముదాయించుకున్నాడు వెంకట్రామయ్య.

తలగడ పక్కకు మార్చి మళ్ళీ మంచం మీద వాలాడు. శాలువా కంఠం వరకూ కప్పుకున్నాడు. కళ్ళమీదికి నిద్ర రావటం లేదు. పౌర్ణమినాటి సముద్రంలా మనసంతా అస్తిమితంగా తయారయింది. ఎంత వద్దనుకున్నా మాటి మాటికీ జ్యోతి ముద్దు ముఖమే కళ్ళముందు ఉద్దం కట్టినట్లు మెదులుతూంది. అవిరామంగా ఆలోచనలు తోసుకుని వస్తున్నాయి. ఏదో చెప్పరాని అలజడి నిద్రను దూరం చేసింది. భార్యను లేపుదామనుకున్నాడు. కాని, ఎందుకు లేపటం? అది అసలే కంగారు మనిషి అని నిబ్బరించుకున్నాడు. అలాగే నిస్తేజంగా ఇంటి కప్పు కేసి చూస్తూ ఉండిపోయాడు.

"టంగ్...టంగ్..." అని దూరంగా టాణాలో మూడు గంటలు కొట్టారు.

దూరంగా ఎక్కడో తొలి కోడి కూసింది.

వెంకట్రామయ్యకు నిద్ర పూర్తిగా దూరమయింది. ఎంత అదిమి పెట్టినా మనసు అశాంతితో భారంగా తయారయింది. ఎందుకో తక్షణం కుమార్తెను చూడాలన్న కోరిక బలంగా గుండెలో తిష్ఠ వేసుకుంది

భారంగా నిట్టూర్చాడు.

వెంకట్రామయ్య మొదటి నుంచీ గుండె దిటవు కలవాడు. ప్రతి చిన్న పని చాలా యోచించి, ఎంతో సేపు స్తిమితంగా ఆలోచించి చెయ్యటం ఆయనకు అలవాటు. తొందర పడే స్వభావం కాదు. కాని, ఈ మధ్య—అంటే వయసు

ఉడిగి వార్ధక్యం వచ్చినప్పటి నుండి తుఫానులో చిగురుటాకులా ప్రతి చిన్న విషయానికీ చలించటం, కాస్త ఆలస్యంగా కొడుకుల దగ్గర నుంచి ఉత్తరం వచ్చినా, కుమార్తె జ్యోతి వెంటనే జవాబు వ్రాయకపోయినా అనవసరంగా ఆందోళన చెందటం పరిపాటి అయిపోయింది. అతి దుఃఖం కాని, అతి సంతోషం కాని పట్టలేని పసివాడి మనస్తత్త్వం ఒంట పట్టింది.

● ● ● ●

అతి నిర్లిప్తంగా రెండు రోజులు గడిచిపోయాయి.

వెంకట్రామయ్య మనసులో అలజడి తగ్గలేదు.

అన్నం నోటికి ఎక్కటం లేదు. పడుకొంటే కన్ను మూత పడటం లేదు. మనసంతా ఏదో చెప్పరాని గుబులుతో, అనిర్వచనీయమైన ఆవేదనతో నిండిపోయింది. ఏదో ఆరాటం, అస్తవ్యస్తమైన ఆలోచనలు ఆ ముసలి ప్రాణాన్ని దహించి వెయ్యటం మొదలుపెట్టాయి.

"ఏమిటి అలా ఉన్నారు? ఒంట్లో బాగుండలేదా? పోనీ, ఒకసారి అబ్బాయిని రమ్మని వ్రాయండి..." అంది సాంత్వనంగా వర్ధనమ్మ.

"కాదే. ఎందుకో మన చిట్టితల్లి జ్యోతి అస్తమానం కళ్ళలో మెదులుతూంది. పోనీ, ఒకసారి వెళ్ళి రమ్మంటావా? అల్లుడు కూడా ప్రతి ఉత్తరంలోనూ వ్రాస్తున్నాడుగా? చిట్టిగాడి అల్లరి చూడక చాలా రోజులు అయింది" అన్నాడు ఆరాటంగా, భార్య వదనంలోకి చూస్తూ. ఆ మాటలు అంటున్నప్పుడు ఆయన మనసు మెత్తగా అర్థం అయింది.

దానితో వర్ధనమ్మ వదనం వికసించింది.

"అవునండి. వాడికీ పాటికి బాగా మాటలు కూడా వచ్చేసి ఉంటాయి. కుర్ర నాగన్న! ఎంత ముద్దుగా ఉంటాడో! పోనీ, ఒకసారి వెళ్ళి రండి. అదెంత భాగ్యం? పైగా అమ్మాయి మళ్ళీ నీళ్ళు పోసుకుందా? ఏకంగా అంటుదిన నెల వచ్చాక నేను వెళ్ళి వస్తాను" అంది హుషారుగా వర్ధనమ్మ.

ఆవిడకు ఏ మూలో మనసులో కూతుర్ని చూడాలన్న కోర్కె బలంగానే ఉంది. పైగా ఇప్పుడు పిల్ల ఒట్టి మనిషి కూడా కాదేమో! ఎలాగూ ఇప్పట్లో రాదు కదా? పోనీ, ఒకసారి వెళ్ళి చూస్తే ఏం పోయింది? అనుకుంది.

భార్య అలా అనేసరికి వెంకట్రామయ్యకు కొండంత సంబరం అనిపించింది.

గబగబా చేతి సంచీలో ఒక జత బట్టలు సర్దుకుని రెండు గంటల బస్సుకు ప్రయాణం అయ్యాడు. బజారులో మిఠాయి, అరటిపళ్ళు కొని భద్రంగా సంచీలో పెట్టాడు.

● ● ● ●

మూడున్నర గంటల్లో బస్సు గమ్యాన్ని చేర్చింది.

కుమార్తె ఇంటి ముందు రిక్షా దిగిన వెంకట్రామయ్య నిర్ఘాంతపోయాడు.

ఇంటినిండా ఇసుక వేస్తే రాలనట్టుగా ఉన్నారు జనం.

వెంకట్రామయ్య ఊపిరి బిగపట్టాడు.

"అదేమిటండీ, వెంకట్రామయ్యగారూ! నిన్న అనగా టెలిగ్రాం ఇస్తే ఇంత ఆలస్యంగా వచ్చారు? వర్ధనమ్మగారు రాలేదేం?" ఎదురు వచ్చిన దూరపు బంధువు ఆత్రతగా ప్రశ్నించాడు.

"టెలిగ్రామా? నాకేమీ అందలేదే? ఇంతకూ... ఏ...ఏమయింది?" వణుకుతున్న కంఠంతో అడిగాడు వెంకట్రామయ్య.

"ఏ మనటమేమిటండీ—కొంప మునిగితేనూ? మీ అల్లుడు బ్రెయిన్ ఫీవర్ వచ్చి పోయాడు. నిన్నటి నుంచి అంతా మీ కోసమే ఎదురుచూస్తున్నాం" అన్నాడు ఆయన.

"ఆఁ?!" వెంకట్రామయ్యకు గుండె ఆగినంత పని అయింది. చేతి సంచీని క్రింద పడేసి, "అమ్మా! జ్యోతీ!" అంటూ ఒక్క ఉదుటున గుంపును ఛేదించుకుని ఉద్వేగంలో లోపలికి పారబడ్డాడు.

శోకదేవతలా భర్త శవాన్ని కౌగిలించుకుని రోదిస్తున్న జ్యోతి తండ్రిని చూస్తూనే తల బాదుకుంది.

"అయిపోయిందే, నాన్నా! అంతా అయిపోయింది. నా బ్రతుకు పట్టేట మునిగిపోయింది, నాన్నా. నేనింక ఏం చూసుకుని బ్రతకాలి, నాన్నా?!" గుండె ఆగిపోయేలా రోదిస్తూ మెరుపులా వచ్చి తండ్రిని వాటేసుకుంది.

ఆ ఆఘాతానికి తట్టుకోలేని వెంకట్రామయ్య పిడుగుదెబ్బ తిన్న వృక్షంలా ఉన్న చోటే నిలువునా కుప్పకూలిపోయాడు. *



విడిచిపోకు: నేస్తం!

— ఎస్. ఎస్. కుమార్ (హన్మకొండ)